క్లుప్తంగా

కులగణన సర్వే ప్రారంభం



రెట్టగుంటలో కులగణన చేస్తున్న సిబ్బంది

గుడిపాల: కుటుంబ పెద్దను ఎంచుకొని కులగణన సర్వేను ప్రారంభించారు. మండలంలో 27 పంచాయతీల్లో శనివారం కులగణన సర్వే ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు సర్వర్ సమస్య తలెత్తింది. ఆ తరువాత సర్వేను నిర్వహించారు. ఇందులో భాగంగా కుటుంబంలోని వారి కులం, విద్యార్హత, వైవాహితతో పాటు ఇళ్లు, ప్రభుత్వ కొళాయి తదితర వివరాలను సేకరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కట్టమంచి రోడ్డు మరమ్మతులు



పూజ చేసి రోడ్డు మరమ్మతులను ప్రారంభించిన నాయకులు

చిత్తూరు కార్పొరేషన్‌: అధ్వానంగా ఉన్న స్థానిక కట్టమంచి–సాంబయ్యకండ్రిగ రోడ్డు మరమ్మతులను ఆర్టీసీ వైస్‌ ఛైర్మన్‌ విజయానందరెడ్డి సొంత నిధులు రూ.50 లక్షల అంచనా వ్యయంతో శనివారం ప్రారంభించారు. ఉదయం రోడ్డు వద్ద పూజ చేసి జేసీబీల సాయంతో పనులు మొదలుపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుమారస్వామిరెడ్డి, కేపీ శ్రీధర్‌, మురళీరెడ్డి, చంద్రనాయుడు, డాక్టర్‌ మురళీధర్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

ఆత్మజ్ఞానంతో మనసు ఆనందభరితం



ప్రసంగిస్తున్న రాజ్యలక్ష్మి

తవణంపల్లె: ఆత్మ జ్ఞానం సంపాదిస్తేనే మనస్సు ఆనందభరితమవుతుందని సీనియర్‌ పిరమిడ్‌ మాస్టర్‌ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని సిద్దంపల్లె సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్‌ మహా శక్తి క్షేత్రంలో ధ్యానమహా యజ్ఞం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సీనియర్‌ పిరమిడ్‌ మాస్టర్‌ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కష్టాలను పోగొట్టుకోవడానికి భగవంతుని కోసం ఎక్కడికెక్కడో వెతుతారు, కానీ భగవంతుడు తనలోనే ఉన్నాడనే సత్యాన్ని గ్రహించాలన్నారు. భౌతిక జీవితంలో లభించేవి ఏదీ శాశ్వతం కాదనీ మనిషి బ్రతికి ఉన్నప్పుడు మనం చేసే మంచి శాశ్వతమని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పిరమిడ్‌ స్పిరిచ్యువల్‌ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్‌ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్‌ రాధిక, ధ్యానులు పాల్గొన్నారు.

కాణిపాకం పరిశుభ్రం



కల్యాణ మండపంలో శుభ్రం చేస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాలు స్వచ్ఛ తీర్థ సేవా కార్యక్రమం ద్వారా శుభ్రం అవుతున్నాయి. వరుసగా ఆరవ రోజు శనివారం ఆలయ అధికారులు, సిబ్బంది చైర్మన్‌ దారిమ్రటరీ, మరగదాంబికా దేవి కల్యాణ మండపం, బస్టాండు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ తిరుమల గిరిబాబు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐకి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: ప్రధానమంత్రి కౌశల్‌ వికాస్‌ యోజన కింద కొత్తగా ప్రారంభిస్తున్న ఎలక్ట్రీషియన్‌(డొమస్టిక్‌ సొల్యూషన్స్‌), ఫిట్టర్‌ ఫ్యాబ్రికేషన్స్‌ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్‌ నగేష్‌ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పూర్తి చేసిన 18 నుంచి 42 సంవత్సరాల వయసు ఉన్న వారు అర్హులన్నారు. ఐటీఐ డ్రాపౌట్స్‌ కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌ కార్డు, బ్యాంకు ఖాతా బుక్కు జిరాక్స్‌లు, 2 పాస్‌పోర్ట్‌ సైజు ఫొటోలతో కళాశాలలో సంప్రదించవచ్చని తెలిపారు.

తిరుచ్చిపై శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి శనివారం రాత్రి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని సుందరంగా అలంకరించి ఊంజల్‌ సేవను కనులపండువగా నిర్వహించారు.

విద్యా విప్లవం.. బాలికలకు వరం



ఈ చిత్రంలో కనిపిస్తున్న విద్యార్థిని పేరు లావణ్య. యం.బండపల్లి హైస్కూల్‌ ప్లస్‌లో బైపీసీ సెకండ్‌ ఇయర్‌ చదువుతోంది. పదోతరగతి వరకు బండపల్లి హైస్కూల్లో చదువుకుంది. గతంలో ఇంటర్‌ చదవాలంటే చిత్తూరు, పూతలపట్టుకు వెళ్లాల్సి వచ్చేది. చిత్తూరుకు బస్సులు, ఆటోల్లోనే రాకపోకలు సాగించాలి. పేద విద్యార్థులకు ఇది వ్యయప్రయాసలతో కూడుకుంది. టెన్త్‌ చదువుకున్న పాఠశాలలోనే ఇంటర్‌ వరకు అప్‌గ్రేడ్‌ చేయడంతో లావణ్య ఎంతగానో సంతోషించింది. చిత్తూరుకు వెళ్లే ప్రయాస తప్పిందని చెబుతోంది. బాలికల కోసం మండలానికో హైస్కూల్‌ప్లస్‌ ఏర్పాటు చేస్తూ జగన్‌ మామ తీసుకున్న నిర్ణయానికి కతజ్ఞతలు తెలిపింది.

- సొంత ఊర్లోనే ఇంటర్‌ విద్య
- యం.బండపల్లి హైస్కూల్‌ ప్లస్‌గా అప్‌గ్రేడ్‌
- ఫలితాల్లో జిల్లాలోనే 2వ స్థానం
- సత్ఫలితాలిస్తున్న మండలానికో హైస్కూల్‌ ప్లస్‌

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్‌ జగన్‌ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమం, నాడు–నేడుతో ఆధునిక సౌకర్యాల కల్పన, హైస్కూల్‌ ప్లస్‌, సీబీఎస్‌ఈ విద్యాబోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ తదితర మార్పులను తీసుకొచ్చారు. ఈ విధానాలన్నీ సఫలీకృతమవుతున్నాయి. పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నాయి. హై స్కూళ్లలో వైవిధ్యమైన ప్లస్‌టూ విధానం విజయవంతం కావడంతో బాలికలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తరగతి గదిలో విద్యార్థులకు బోధిస్తున్న అధ్యాపకులు

పూతలపట్టు: హైస్కూల్‌ ప్లస్‌ విధానంలో బాలికలకు ఉన్న ఊళ్లలోనే ఇంటర్‌ విద్యను అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆశయం. ఇందుకనుగుణంగా మండలంలోని యం.బండపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను హైస్కూల్‌ ప్లస్‌గా ప్రభుత్వం అప్‌గ్రేడ్‌ చేసి 2022–23 నుంచి అమలు చేసింది. ఈ పాఠశాలలో ఇంటర్‌ విద్యకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. గతేడాది మొదటి సంవత్సరంలో 17 మంది, ఈ సంవత్సరం 16 మంది బాలికలు చేరారు. ప్రస్తుతం మొత్తం 33 మంది చదుతున్నారు. అందులో ఎంపీసీ 13, బైపీసీ 19 మంది అభ్యసిస్తున్నారు. ఆ గ్రూపులో సబ్జెక్టుల బోధనకు అధ్యాపకులను సైతం ప్రభుత్వం నియమించింది. ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ అందించింది. గత సంవత్సరంలో ఇంటర్మీడియట్‌ పబ్లిక్‌ పరీక్షలలో యం.బండపల్లి హైస్కూల్‌ ప్లస్‌ నుంచి 14 మంది పాస్‌ అవ్వడంతో జిల్లాలోనే 2 వస్థానంలో నిలిచింది. నియోజకవర్గంలో మొదటి స్థానం సాధించింది.

పండించిన కూరగాయలతోనే...



పాఠశాల ఆవరణలో పండించిన గోంగూర



పండిన సొరకాయ

ఇక్కడి పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి కూరగాయలు పండించి వాటినే మధ్యాహ్న భోజనానికి ఉపయోగిస్తున్నారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న స్థలాన్ని విద్యార్థులు వృథా చేయకుండా ఆ ప్రదేశంలో కూరగాయలను పండించడం విశేషం. తద్వారా కూరగాయల పంట ఉత్పత్తిని విద్యార్థులు స్వయంగా తెలుసుకుంటున్నారు. బెండకాయ, గోంగూర, సొరకాయ వంటి కాయకూరలు పండిస్తున్నారు. మిగిలిన ప్రదేశంలో వివిధ రకాల మొక్కలు నాటారు. అవి చూడడానికి ఎంతో అందంగా, ఆహ్లాదంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక హైస్కూల్‌ ప్లస్‌ ఏర్పాటు చేసి, ఇంటర్‌ కోర్సులు అందుబాటులోకి తీసుకురావడంతో ప్రధానంగా బాలికలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. అయితే విద్యార్థులకు తరగతి గదులు సరిపోవడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీనిపై ప్రతిపాదనలు పంపామని త్వరలోనే మంజూరవుతాయని చెప్పారు.

ఎంతో ఉపయోగం



పదో తరగతి తరువాత మమ్మల్ని బయటికి పంపాలంటే తల్లిదండ్రులు భయపడేవారు. ఇంటర్‌ చదవాలంటే చిత్తూరుకు వెళ్లాలి. రోజూ వెళ్లి రావాలంటే రూ.100 ఖర్చవుతుంది. ఆర్థిక భారంతో పాటు, కష్టాలు పడాల్సివచ్చేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. నేను పదో తరగతి చదివిన హై స్కూల్‌లోనే ఇంటర్‌ విద్య అందుబాటులోకి తేవడంతో ఇక్కడే చేరాను. అమ్మ ఒడి కూడా వస్తోంది. జగన్‌ మామయ్య మేలు మర్చిపోలేం.

–స్టెల్లా, మొదటి సంవత్సరం, ఎంపీసీ

పాఠాలు బాగా చెబుతున్నారు



హైస్కూల్‌ ప్లస్‌గా యం. బండపల్లి స్కూల్‌ అప్‌గ్రేడ్‌ అయిన మొదటి సంవత్సరం నుంచే అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించారు. అధ్యాపకులంతా అర్థమయ్యేలా పాఠాలు బాగా చెబుతున్నారు. మా అందరి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. బాగా అర్థం చెసుకోగలుగుతున్నాం. ఫస్టియర్‌ అన్ని సబ్జెక్టుల్లో పాసయ్యా. సొంతూరిలోనే కళాశాల ఏర్పాటు చేయడం మాకెంతో మేలు చేసింది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– మమత, రెండవ సంవత్సరం, బైపీసీ

అడ్మిషన్లు పెరిగాయి



ప్రభుత్వం అందించే అన్ని మౌలిక సదుపాయాలను విద్యార్థులకు అందిస్తున్నాం. దూరప్రాంతాలకెళ్లి చదువుకోవడం కన్నా సొంతూరిలోనే అభ్యసించాలని బాలికలు కోరుకుంటారు. వారి కోరిక మేరకు ప్రభుత్వం ఇంటర్‌ కోర్సును పాఠశాలలోనే అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థులు చక్కగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తెస్తున్నారు. దీంతో జిల్లాలోనే 2 వ స్థానంలో పాఠశాల నిలిచింది. ఈ సంవత్సరం అడ్మిషన్లు కూడా పెరిగాయి.

– దామోదరనాయుడు, హెచ్‌ఎం, యం.బండపల్లి

పకడ్బందీగా ఆడుదాం ఆంధ్రా



మైదానంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య, ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ క్రీడాపోటీలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. మండల స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ముగియడంతో నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు వివరించారు. అందులో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం, పోలవరం మైదానాలను పరిశీలించారు. ఈ నెల 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో ×ఆడుదాం ఆంధ్రా౯ క్రీడాపోటీలను నిర్వహిస్తుండగా వాటిని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్‌, బ్యాడ్మింటన్‌, వాలీబాల్‌ పోటీల్లో 5 మండలాల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు నియమ నిబంధనలు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా విధులను నిర్వహించాలన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్‌ విజయభాస్కర్‌, ఎంపీడీఓ గౌరి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రాల్లో వసతులు కల్పించండి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌ అరుణ



తవణంపల్లెలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ శేషయ్య

చిత్తూరు అర్బన్‌: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగర పాలక పరిధిలోని పోలింగ్‌ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన మేర సౌకర్యాలు కల్పించే పనులు వేగంగా పూర్తి చేయాలని ఏఈఆర్వో, నగర కమిషనర్‌ అరుణ ఇంజినీరింగ్‌ విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్‌ శుక్రవారం కొంగారెడ్డిపల్లి పరిధిలోని 25, 26, 45, 47, 50, 52 పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించారు. పోలీస్‌ కేంద్రాల్లో జరుగుతున్న ఎలక్ట్రికల్‌, నీటి సరఫరా, ర్యాంపుల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ప్రతి పోలింగ్‌ కేంద్రంలో విద్యుదీకరణ, ఫర్నిచర్‌, నీటి సరఫరా, మరుగుదొడ్లు, ర్యాంప్‌ సౌకర్యాలు కచ్చితంగా ఉండాలన్నారు. షర్మన్‌ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఐటీఐలోని పోలింగ్‌ కేంద్రాల్లో జరుగుతున్న ఎలక్ట్రికల్‌ పనులను కమిషనర్‌ తనిఖీ చేశారు. పోలింగ్‌ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై ఇంజనీరింగ్‌ అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్‌ అధికారులను ఆదేశించారు. ఎంఈ గోమతి, డీఈ రమణ, ఏఈ రజని, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

తవణంపల్లె: ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు మండలంలోని పోలింగ్‌ కేంద్రాల్లో యుద్ధప్రాతిపదికన మౌళిక వసతులు కల్పించాలని పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి శేషయ్య అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పోలింగ్‌ కేంద్రాల మరమ్మతులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈఆర్‌ఓ శేషయ్య మాట్లాడుతూ మండలంలోని 19 పోలింగ్‌ కేంద్రాల్లో వసుతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్‌ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్‌, మరుగుదొడ్లు, మరమ్మతులను ఈ నెల 25వ తేదీ లోపల పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ, తహసీల్దార్‌ గుణశేఖర్‌ రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌ కలాం ఆజాద్‌, ఎన్నికల నిర్వహణ అధికారులు, ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

కార్వేటినగరం: అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్‌ ఎన్నికలు నిర్వహించే పోలింగ్‌ కేంద్రాల్లో అన్నిరకాలైన మౌలిక వతులు ఉండేలా చూడాలని తహసీల్దార్‌ రవికుమార్‌, ఎంపీడీఓ మోహన్‌మురళీ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సెక్టోరల్‌ అధికారులు, అసిస్టెంట్‌ ఇంజనీర్లు, పంచాయతీరాజ్‌ శాఖ అధికారులతో పోలింగ్‌ బూత్‌ల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్‌ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే పోలింగ్‌ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్‌ సౌకర్యం, ర్యాంపు సౌకర్యం కలిగి ఉండేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు మౌలిక వసతులు ఏర్పాటుపై పూర్తి బాధ్యత ఎంఈఓలపై ఉందన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు వైద్యం



వృద్ధుడికి ఇంటి వద్దనే వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్‌ చంద్రమహేష్‌

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. మండలంలోని పీ.కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 85 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్‌ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్యశ్రీ పథకం గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉన్నచోట దోమలు వృద్ధి చెందడంతో పాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్‌ అసిస్టెంట్‌ సుధాకర్‌, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుడిపాల: వైద్యసేవలు అందించేందుకు ఇంటి వద్దకే వస్తున్నట్లు డాక్టర్‌ చంద్ర మహేష్‌ అన్నారు. పెద్దిశెట్టిపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచాన పడ్డ రోగులకు ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం బీపీ, షుగర్‌, గర్భిణులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది తేజ, చంద్ర, ఇందుమతి, నిరోషా, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్‌ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌ సేవను భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులయ్యారు. గోవిందనామస్మరణ మధ్య నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్‌ గ్రేడ్‌ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్‌, సూపరింటెండెంట్‌ చెంగల్రాయులు, అర్జితం ఇన్‌స్పెక్టర్‌ ధనశేఖర్‌, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి కోతలు ముమ్మరం



పెద్ద పాండూరు ప్రాంతంలో యంత్రంతో వరికోత

వరదయ్యపాళెం: మండలంలోని వివిధ ప్రాంతాలలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలోని చిలమత్తూరు, సీఎల్‌ఎన్‌పల్లి, రాచర్ల, కోవూరుపాడు, అంబూరు, వరదయ్యపాళెం, తొండంబట్టు, చిన్న పాండూరు, పెద్ద పాండూరు ప్రాంతా ల్లో ఖరీఫ్‌ చివర, రబీ ప్రారంభంలో వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో కోతలు జోరుగా సాగుతున్నాయి. మండలంలో ప్రస్తుత రబీ సీజన్‌లో 3500 హెక్టార్లలో వరి పంటను సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

ఘనంగా సర్వమంగళాదేవి జాతర



సత్యవేడు: ట్రాక్టరుపై ఊరేగింపుగా వెళుతున్న సర్వమంగళాదేవి

సత్యవేడు: గిరిజన కాలనీ గ్రామ దేవత సర్వమంగళాదేవి సంక్రాంతి జాతర మహోత్సవం శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యంతోపాటు గాజులు, చీరలు సమర్పించారు.

మట్టి విగ్రహానికే అలంకరణ, మొక్కులు

ఉత్సవాల్లో పంచ లోహాలతో తయారు చేసిన ఉత్సవ విగ్రహాలకు అలంకరణ చేసి ఊరేగిస్తారు. సత్యవేడులో 65 ఏళ్లుగా సర్వమంగళాదేవి రూపాన్ని బంక మట్టితో గిరిజన కుటుంబీకులు ప్రత్యేకంగా తయారు చేస్తారు. పూలు, వస్త్రాలతో అమ్మవారిని అలంకరిస్తారు. ఉదయం అమ్మవారికి ఉయల సేవ, సాయంత్రం ఆలయం ఆవరణలో పొంగళ్లు పెడతారు. తర్వాత అమ్మవారిని గ్రామంలో ఊరేగించి అనంతరం చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగ తర్వాత అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ప్రతిమను తయారుచేసి పూలు, వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టారు. అనంతరం అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇళ్ల ముందు పెద్ద ఎత్తున ముగ్గులు వేశారు. విశేషపూలాంకరణతో అలకరించిన అమ్మవారిని గొబ్బెమ్మ పాటలు పాడుతూ ఆలయం వద్దకు తీసుకు వచ్చారు. సర్వమంగళాదేవికి గిరిజనులు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి నృత్యాలు చేశారు. ట్రాక్టరుపై అమ్మవారిని ఊరేగించారు. శుక్రవారం రాత్రి ప్రారంభమైన ఊరేగింపు శనివారం ఉదయం 8 గంటల వరకు సాగింది. మహిళలు అమ్మవారి ఊరేగింపు వెంట గొబ్బెమ్మ పాటలు పాడుతూ సద్ది అన్నం, పెరుగు అన్నం తీసుకొని వెళ్లారు. సత్యవేడు బీసీ కాలనీ, గిరిజన కాలనీ, ఆర్టీసీ రోడ్డు, శ్రీకాళహస్తి బస్టాండు రోడ్డు, నేతాజీ రోడ్డు నుంచి జంట కోనేరు సమీపంలోని చెరువు వరకు ఊరేగింపు సాగింది. మహిళలు తెచ్చిన సద్ది అన్నం, పెరుగు అన్నం సమర్పించారు. అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేశారు.